క్లుప్తంగా

24న విజయదశమి జరుపుకోవాలి

భానుపురి : విజయదశమి పండుగను ఈ నెల 24న జరుపుకోవాలని వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది కావాలని విజయదశమి పండుగ విషయంలో గందరగోళానికి గురి చేస్తున్నారని తెలిపారు. 23వ తేదీ సోమవారం విజయదశమి ఆచరించరాదని ప్రముఖ పీఠాలు, ప్రముఖ పంచాంగాలు తెలిపినట్లు వేణుగోపాలాచార్యులు పేర్కొన్నారు. అధికారులు కూడా ఈ నెల 24న దసరా ఏర్పాట్లు చేయాల్సిందిగా కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పర్వతం సంధ్యారాణి

సూర్యాపేటటౌన్ : క్రీడలతో స్నేహభావంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షులు పర్వతం సంధ్యారాణి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌జీఎం క్రికెట్ గ్రౌండ్‌లో ఎంప్లాయీస్ ప్రీమియం లీగ్ మ్యాచ్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు నిర్వహించడం ద్వారా స్నేహ సంబంధాలు ఏర్పడతాయన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ టీమ్, సూర్యాపేట టీచర్స్ జట్లు తలపడ్డాయి. ఈ పోటీలో ఇరిగేషన్ టీం విజేతగా నిలిచింది. ఈ కార్యక్రమంలో క్రీడల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

21న బహుజన బతుకమ్మ

సూర్యాపేటటౌన్ : వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న చెన్నకేశవపురంలో జరిగే బహుజన బతుకమ్మను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు కూలీ పోరాట సమితి నాయకుడు బత్తుల గుర్వయ్య, పీడీఎస్‌యూ(విజృంభణ) రాష్ట్ర సహాయ కార్యదర్శి బెల్లి నాగరాజు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో బహుజన బతుకమ్మ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, ఈశ్వర్, నర్సయ్య, నాగయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేల ఆర్థికసాయం

అర్వపల్లి: కోడూరు గ్రామానికి చెందిన నిరుపేద నాయీబ్రాహ్మణుడు మల్యాల సందీప్‌కు గ్రామంలో క్షౌరశాల ఏర్పాటు చేసుకునేందుకు కాంగ్రెస్ జిల్లా నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి సోమవారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్–అనిత దంపతులు అభిషేక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుయ్యని బాబు, మారోజు బ్రహ్మచారి, వీరెల్లి వెంకట్‌రెడ్డి, గుండెపురి లక్ష్మయ్య, గడ్డం సైదులు, వల్లపు నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవాలు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో సోమవారం ఆశ్వయుజ మాస స్వాతి నక్షత్రం సందర్భంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చకిలం క్రిష్ణకుమార్, బండకవి క్రిష్ణమోహన్, మధుసూదనాచారి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లలో వసతుల కల్పనకు చర్యలు



పోలింగ్ బూత్‌కు నంబర్ రాస్తున్న ఆర్టిస్ట్

అర్వపల్లి : వచ్చే నెల 30న శాసనసభ ఎన్నికలు జరుగనుండటంతో అధికారులు పోలింగ్ స్టేషన్‌లలో అన్ని వసతులు కల్పిస్తున్నారు. మండల వ్యాప్తంగా పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేసే ప్రభుత్వ భవనాలకు బూత్‌లను సూచించే పేరు, నంబరు రాయిస్తున్నారు. అలాగే బూత్‌లలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులు, ఇతర ఏర్పాట్లు చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో 32 పోలింగ్ బూత్‌లు ఉండగా రెండు రోజుల నుంచి అన్నిట్లో వసతులు కల్పిస్తున్నారు. అన్ని బూత్‌లు ప్రభుత్వ పాఠశాలల్లోనే ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు.



దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంప్

పేదల సంపద పెంచడమే లక్ష్యం



సూర్యాపేట : సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి



తిరుమలగిరి : సభా స్థలిని పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

సూర్యాపేట : సంపదను పెంచి, ప్రజలకు పంచాలన్నదే కేసీఆర్ లక్ష్యమని మంత్రి జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలోని వెంకటేశ్వర టౌన్ షిప్‌లో కాలనీవాసులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2014కు ముందు ఉన్న పరిస్థితులను 2014 నుంచి సూర్యాపేటలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో దేశంలోనే సూర్యాపేట అగ్రస్థానంలో ఉందన్నారు. సూర్యాపేటలో నెలకొన్న ప్రశాంత వాతావరణం ఫలితంగానే డీమార్ట్, మాంగళ్య, సీఎంఆర్ వంటి వ్యాపార సంస్థలు వెల్లువలా వస్తున్నాయని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మెడికల్ కాలేజ్, మహా ప్రస్థానం, ట్యాంక్‌బండ్ నిర్మాణాలు సూర్యాపేటకే తలమానికంగా మారాయన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామిక హబ్ ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని, పదివేల మందికి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సభా స్థలిని పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యే

తిరుమలగిరి : ఈ నెల 29న తిరుమలగిరిలో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి కోరారు. సోమవారం తిరుమలగిరిలో సూర్యాపేట–జనగామ ప్రధాన రహదారి పక్కన ఉన్న సభా స్థలిని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌తో కలిసి పరిశీలించి మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ 3వసారి అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 29న జరిగే సమర శంఖారావం బహిరంగసభకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఆయన వెంట ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, బీఆర్‌ఎస్ పట్టణ శాఖ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, జల్లా శంకర్, అంబయ్య, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు



తిరుమలగిరి : గాదరి కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే కిషోర్ కుమార్ అన్నారు. సోమవారం తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని బీజేపీకి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జెట్టి వెంకన్న, మూల యాదగిరి, మూల వెంకన్న, వీరయ్య, మధురెడ్డి, వంగరి సోమయ్య, లక్ష్మయ్య, ఎల్లయ్య, రాములు, సోమన్న, గోపాల్, మల్లయ్య, చంద్రయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తిరుమని యాదగిరి, కౌన్సిలర్ శ్రీలత, డానియల్, వెంకట్‌రెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రోమోర్ కేంద్రం ప్రారంభం

మద్దిరాల : కోరమండల్ కంపెనీకి చెందిన మన గ్రోమోర్ సెంటర్‌ను సోమవారం మద్దిరాల మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ బ్రాంచ్‌ను ఎస్‌ఐ రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించార. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ మార్త అనిత కృష్ణమూర్తి, గ్రోమోర్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రోమోర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ

రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆత్మకూరు (ఎస్) : రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలుచేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ రైతు సంఘం ఆత్మకూరు మండల కమిటీ ఆధ్వర్యంలో నిమ్మికల్ గ్రామంలోని గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేశామని గొప్పలు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం పూర్తి కాలేదన్నారు. రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేసి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిఏెడల తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు బెల్లంకొండ చక్రయ్య, గుండు లింగయ్య, కొల్లు వెంకన్న, రేణిగుంట్ల రవి, గంపల ఎల్లయ్య, బొప్పాని కనకమ్మ, కోతి లక్ష్మారెడ్డి, మూల విజయ రెడ్డి, గోలి భాగ్యమ్మ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న చైర్మన్ సురేందర్‌రెడ్డి

అర్వపల్లి : బీఆర్‌ఎస్ ప్రభుత్వ తొమ్మిదిన్నర ఏళ్ల పాలన కాలంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొమ్మాలలో జరిగిన బీఆర్‌ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ గంగదెరి వెంకటమ్మ, గ్రామశాఖ అధ్యక్షుడు కుక్కడపు సైదులు, బి.ప్రవీణ్, గంగదెరి శ్రీనివాస్, మాదం వీరారెడ్డి, సత్తయ్య, రవి, ఉపేంద్ర, శ్రీను, కె.ఉదయ్, సంజీవరెడ్డి, మహేష్, విజ్జిరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



సద్దల చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భానుపురి : బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలోని మినీట్యాంక్ బండ్ (సద్దుల చెరువు) వద్ద ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం సద్దల చెరువులో నిమజ్జనం చేశారు. వేడుకల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిధులు లేక.. నిర్వహణ భారం



శాంతినగర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయం

ప్రత్యేక నిధులు కేటాయించాలి



చిన్న పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. చిన్న జీపీలకు ఎలాంటి ఆదాయ మార్గాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాక్టర్ నిర్వహణ సైతం భారంగా మారింది.

– షేక్.నాగుల్‌మీరా, సర్పంచ్, శాంతినగర్

- చిన్న పంచాయతీల్లో ట్రాక్టర్ కిస్తీల కష్టాలు

నాగారం : పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్ల నిర్వహణ చిన్న పంచాయతీలకు మోయలేని భారంగా మారుతోంది. బ్యాంకుల ద్వారా తీసుకున్న ట్రాక్టర్లకు పంచాయతీలు ప్రతి నెలా కిస్తీల రూపంలో డబ్బులు చెల్లించాలి. కానీ చిన్న పంచాయతీలకు ఎలాంటి ఆదాయ మార్గాలు లేకపోవడంతో ప్రస్తుతం వారు నెలనెలా కిస్తీలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. మండలంలో కొత్తగా ఏర్పడిన చిన్న పంచాయతీల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. నాగారం మండలంలో 14 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో చిన్న గ్రామపంచాయతీలే ఆరు ఉన్నాయి. ప్రతి పల్లెలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రభుత్వం ట్రాక్టర్లను మంజూరు చేసింది. వీటి నిర్వహణ మొత్తం పంచాయతీలే మోయాల్సి ఉంటుంది. ప్రతినెలా ట్రాక్టర్ కొనుగోలు కిస్తీలు, డీజిల్ వ్యయం, మరమ్మతులు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించాల్సి రావటంతో చిన్న పంచాయతీల్లో వచ్చే నిధుల్లో ఎక్కువ శాతం వాటికే ఖర్చవుతున్నాయి. ఈ ఖర్చుల భారం నుంచి పంచాయతీలను గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు సమకూర్చాలని పాలకులు డిమాండ్ చేస్తున్నారు. చిన్న పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరు ఇంటిపన్ను. కానీ ఆ నిధులు రెండు, మూడు నెలల కిస్తీలకు కూడా సరిపోవడం లేదని ఆయా పంచాయతీల సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీటికి మిషన్ భగీరథ రావడంతో నీటి పన్నును పూర్తిగా రద్దు చేశారు. దీంతో చివరకు ప్రభుత్వం ఇచ్చే పల్లె ప్రగతి నిధులే దిక్కుగా మారాయి. పంచాయతీలకు వచ్చే నిధుల్లో ట్రాక్టర్ల కిస్తీలు, మరమ్మతులు, డీజిల్, కార్మికుల వేతనాలకు సగానికి పైగా పోతే ఇతర పనులు ఎలా చేసేదని సర్పంచులు వాపోతున్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడ : బీఆర్‌ఎస్ నుంచి కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా బీఫాం తీసుకొని తొలిసారి కోదాడకు వచ్చిన ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌కు కోదాడ పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని బొడ్రాయికి మల్లయ్యయాదవ్ దంపతులు జలాభిషేకం నిర్వహించి, పూజలు చేశారు. అలాగే ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగార్జున సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కోదాడలో గులాబీ జెండా ఎగురువేస్తామన్నారు. కార్యక్రమంలో చింత కవిత, కల్లూరి పద్మజ, వెంపటి మధు, ఇమ్రాన్‌ఖాన్, తుమ్మలపల్లి హాస్కర్, శీలం సైదులు, శివాజీనాయక్, మేదర లలిత, కొండా సైదయ్య, నల్లపాటి శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ దంపతులు

బీటీ రోడ్లకు మరమ్మతులు చేసేదెప్పుడో?

- గుంతలమయంగా మారిన పలు గ్రామాల రహదారులు
- మూలమలుపుల వద్ద కనిపించని సూచిక బోర్డులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



వట్టిఖమ్మంపహాడ్-వాల్యతండాల మధ్య గుంతలు పడిన బీటీ రోడ్డు

చివ్వెంల : మండలంలోని గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులు ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోక ప్రమాదకరంగా మారాయి. రోడ్లపై గుంతలు విపరీతంగా ఉండడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్–వాల్యతండా, పాశ్యానాయక్ తండా, పిల్లలజెగ్గతండా, అక్కలదేవిగూడెం– పాశ్యానాయక్ తండా, బి.చందుపట్ల–తిమ్మాపురం, ఖీమ్లాతండా–చందుపట్ల, చివ్వెంల–పాండ్యానాయక్‌తండా, లక్ష్మణ్‌నాయక్‌తండా–పులితండా గ్రామాల మధ్య బీటీ రహదారులపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారులను ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. అయితే భారీ వాహనాల రాకపోకలు, వర్షాలకు రోడ్లు అక్కడక్కడ గుంతలమయంగా మారాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో వాహనదారులు గుంతలు కనిపించక ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అక్కడక్కడ మట్టి వేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ప్రయాణికులు అంటున్నారు. రోడ్లపై మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఉండడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేయించాలని, మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మండలంలోని వివిధ గ్రామాలకు మూలమలుపుల సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పైగా రోడ్లు గుంతలమయంగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, రోడ్లకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలి.

– ధరావత్ నరేష్, వాల్యతండా

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

వట్టిఖమ్మంపహాడ్ గ్రామం నుంచి వాల్యతండా వరకు ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. ప్రజా ప్రతినిధులు దృష్టిపెట్టి రోడ్డుకు మరమ్మతులు చేయించాలి. వాహనదారుల ఇబ్బందులు తొలగించాలి.

– కొండ వెంకన్న, వట్టిఖమ్మంపహాడ్

సీఆర్పీల సమస్యలపై పోరాటాలు చేయాలి



నూతన జిల్లా కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న యాదగిరి

సూర్యాపేట : సీఆర్పీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడూ స్పందిస్తూ పోరాటాలు చేయాలని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ఆ సంఘం జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఆర్పీలంతా ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలన్నారు. ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లాలోని సీఆర్పీలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సందర్భంగా సంఘం నూతన జిల్లా అధ్యక్షుడిగా కాంపాటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జలగం లింగయ్య, కోశాధికారిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కాటి శ్రీనివాస్, వహీద్, రాజేష్, గోవర్ధన్, అశోక్, మహిళా అధ్యక్షురాలిగా శారద, కార్యదర్శిగా సావిత్రి, కార్యదర్శులుగా జానకిరామ్, రవీందర్, గురుస్వామి, లింగయ్య, ప్రచార కార్యదర్శిగా బి.శ్రీధర్‌లను ఎన్నుకుని వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కంచర్ల మహేందర్, మామిడి సైదయ్య, రామిడి వెంకట్‌రెడ్డి, కట్టా రాజు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు



పస్తాలలో పట్టుబడిన మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

నూతనకల్ : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నూతనకల్ మండల పరిధిలోని ఎర్రపహాడ్, దిర్శనపల్లి క్రాస్ రోడ్డు వద్ద బెల్టు షాపులు నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్ముతున్న అనంతుల శ్రీనివాస్, పొదిల లక్ష్మమ్మ, చల్లమళ్ల భిక్షంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి వివిధ కంపెనీలకు చెందిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నాగారం : ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి బెల్ట్‌షాపులో అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకొని సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదులుగౌడ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని పస్తాలకు చెందిన చిత్తలూరి అంజయ్య అనే వ్యక్తి బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసినట్లు తెలిపారు. రూ.5000 విలువగల మద్యం పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఈ మద్యాన్ని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



తుంగతుర్తిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఓఎస్‌డీ ప్రశాంతి

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన గురుకులాల జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులకు సోమవారం బహుతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురుకులాల ఓఎస్‌డీ ప్రశాంతి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడలు ఎంతో దోహపడుతాయన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుకులాల డీసీఓ పుందరీక చారి, ప్రిన్సిపల్స్ శ్యామలత, శమంతకమణి, సునీత, మంజుల, రాధాకృష్ణ, కవితరాణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి అవతారంలో దుర్గామాత

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని గ్రామాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం దుర్గామాత గాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు దుర్గామాత విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



తుంగతుర్తిలో పూజలు చేస్తున్న భక్తులు



నాగారం : మాచిరెడ్డిపల్లిలో..



తిరుమలగిరిలో..



పెన్‌పహాడ్ : ధర్మాపురంలో..



అర్వపల్లిలో..

మునగాల పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మునగాల : విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వంతో పాటు ఉన్నతాధికారులతో దురుసుగా ప్రవర్తించిన మునగాల గ్రామపంచాయతీ కార్యదర్శి కె.శ్వేతను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఎస్.వెంకట్రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. మండల కేంద్రంలో ఈనెల 14న నిర్వహించిన మొక్కలను రక్షించే వారోత్సవాలకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ సీఈఓ సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాగా సదరు కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శి ఆలస్యంగా వచ్చారు. దీంతో సీఈఓ సదరు కార్యదర్శిని ప్రశ్నించగా తనకు ముందస్తుగా ఎలాంటి సమాచారం లేదని ధిక్కార స్వరంతో సమాధానం ఇచ్చారు. కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాక, దురుసుగా ప్రవర్తించిన కార్యదర్శి శ్వేతపై కలెక్టర్‌కు సీఈఓ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ స్పందించి జూనియర్ పంచాయతీగా విధులు నిర్వర్తిస్తున్న శ్వేతను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సదరు ఉత్తర్వులను సోమవారం పంచాయతీ కార్యదర్శికి అందజేసినట్లు మండల పంచాయతీ అధికారి భూపాల్‌రెడ్డి తెలిపారు. కాగా బరాఖత్‌గూడెం గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును మునగాల గ్రామపంచాయతీకి ఇన్‌చార్జ్‌గా నియమిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మునగాల : మండలంలోని తాడువాయిలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన 20 కుటుంబాల వారు సోమవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో చిట్యాల లింగయ్య, లొడంగి సాయి, దాసరి హుస్సేన్, కుంభం అనీల్, కుంభం నాగరాజు, బోడయ్య, సందీప్, నాగయ్య, లింగయ్య, ఉపేందర్, మల్లయ్య, వీరబాబు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, దేవరం సుధీర్‌రెడ్డి, కారింగుల వెంకన్న, బాలకృష్ణ, వీరయ్య, సాయికుమార్, వీరబాబు, రామకృష్ణ, కృష్ణయ్య పాల్గొన్నారు.